విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

కాలనీ కాదు.. ఊరే..

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : అర్హత గల ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో రాష్ట్రంలో కాలనీలు కాదు.. ఏకంగా ఊళ్లకు ఊళ్లే రూపుదిద్దుకుంటున్నాయి అని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట మండలం, ముక్త్యాల గ్రామం జగనన్న కాలనీలో మాజీ ఎంపీటీసీ షాబుద్దీన్ సోదరి అయిన షేక్ షాని అలీ వారి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారిక, రాము, యువ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. త్వరితగతిన గృహాలు నిర్మించేందుకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందించి ఆపై గృహాలను కూడా కల్పించడం ఒక సంచలనం అన్నారు. నేడు జగ్గయ్యపేట మండలం ముక్త్యాల గ్రామం నందు జగనన్న కాలనీ నందు పెద్ద ఎత్తున లబ్దిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని అన్నారు. అలాగే నియోజకవర్గంలో మిగతా అన్ని గ్రామాల వారు ఇలానే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని వారికి అవసరమైన వసతులు సమకూరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల నమోదులో బాధ్యత వహించండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఓటర్ల జాబితా తయారీలో ఓటర్ల నమోదు అధికారులు (ఈఆర్వోలు)పూర్తి బాధ్యత వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.రాజాబాబు సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ డిఆర్ఓ పెద్ది రోజా,జిల్లా అధికారులు, ఎన్నికల అధికారులు, క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల జాబితా, జగనన్న ఆరోగ్య సురక్ష, రెవెన్యూ సేవలు, జగనన్నకు చెబుదాం, సాగునీటి సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను బూతు స్థాయి అధికారులు అందరికీ అందజేసి శుక్రవారం అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ప్రచురించాలన్నారు ఈఆర్వోలైన ఆర్డీవోలు, ఏ ఈ ఆర్ ఓ లైన తహసిల్దార్లు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రాంగణాన్ని అహ్లాదంగా ఉంచండి

మచిలీపట్నం కలెక్టరేట్ సుందరీకరణ పనుల్లో భాగంగా ప్రాంగణమంతా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో కలెక్టరేట్ సుందరీకరణ పనులపై వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ, కలెక్టరేట్ కు వివిధ రకాల పనుల కోసం వచ్చే ప్రజలు సేద తీరడానికి నీడనిచ్చే చెట్లను అధికంగా పెంచాలని,అలాగే, కలెక్టరేట్ ప్రాంగణంలో అంతర్గత రహదారుల అభివృద్ధి లైటింగ్, లెవలింగ్ పనులు, ప్రహరీ గోడ నిర్మాణం, జంగిల్ క్లియరెన్స్, డ్రైన్ల నిర్మాణం, చక్కని పూల మొక్కలతో ప్లాంటేషన్, పార్కింగ్ సౌకర్యం తదితర సుందరీకరణ పనులపై మునిసిపల్, ఫైర్ డిపార్ట్మెంట్, పంచాయతీ రాజ్, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు అందరూ చక్కని సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ విసి రాజ్యలక్ష్మి, మచిలీపట్నం ఆర్డిఓ ఎం.వాణి, కలెక్టరేట్ తాహిసిల్దార్ రాధిక, మచిలీపట్నం తహసిల్దార్ శ్రీ విద్య, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ రామ్ లక్ష్మణ్, ఆర్కియాలజీ కన్జర్వేషన్ అసిస్టెంట్ నాగేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులను గుర్తించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థలైన మెడికల్, మున్సిపల్, విద్యుత్, ఆర్టీసీ, రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అదే విదంగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.25 వేలు కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఓఎల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మోదుమూడి శ్రీహరిరావు భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ 11వ మహాసభ ఆమోదించిన తీర్మానాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని 60 సంవత్సరాలు నిండిన ప్రతి ముఠా కార్మికులకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు కార్మికుడు చనిపోతే ప్రభుత్వమే రూ.10 లక్షలు చెల్లించాలని, భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్, ప్రతి కార్మికునికి భవన నిర్మాణ సంక్షేమ నిధి నుండి రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని, వేలాదిమంది ఉంటున్న బందరు పోర్టు నిర్మాణంలో పనిచేస్తున్న మత్స్య కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని, సముద్ర తీర ప్రాంతంలో ప్రభుత్వ మిగులు భూములను సర్వే చేసి మత్స్య కార్మికులకు ప్రతి కార్మికునికి రెండు ఎకరాల చొప్పున ఇవ్వాలని, రోల్డ్ గోల్డ్ కవరింగ్‌లో పనిచేస్తున్న కార్మికులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఓ ఎల్ రావు తీర్మానాలను విడుదల చేశారు. కావలిలో ఆటోనగర్ బస్సు డ్రైవర్‌ను 26వ తేదీన కారుకు సైడ్ ఇవ్వలేదని డ్రైవర్‌ని కొట్టడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండించిందని అన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవా లని లేనిపక్షంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ గౌరవ అధ్యక్షులు లింగం ఫిలిప్, అధ్యక్షులు బెల్లంకొండ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర-గన్నవరం : పంట నష్టపోయిన రైతులకు, వ్యవసాయ కూలీలు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రాష్ట ప్రభుత్వాన్ని గన్నవరం నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కట్టవరపు విజయరావు డిమాండ్ చేశారు. రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు శుక్రవారం ఉంగుటూరు మండలం తెల్లప్రోలు గ్రామ సచివాలయం కార్యదర్శికి రైతు సంఘం కార్యవర్గ సభ్యులు శనగ సుబ్బారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఆత్కూరు, పెద్దఆటపల్లి, చిన్న అవుటపల్లి సచివాలయాల్లోని కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ... వర్షాభావం తక్కువగా ఉన్న మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులకు, కౌలు రైతులకు పంట రుణాలు మాఫీ చేయాలని, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలను గుర్తించి కరువు భత్యంగా 35 కిలో బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనులు లేని ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పనిదినాలు కల్పించాలని, కరువు ప్రాంతంలో విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలని, రైతులకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంగళ్ల శివయ్య, వై నాగరాజు, వెంగళ్ల రంగారావు, పరమట నరేష్, కట్టవరపు బెనర్జీ,సీహెచ్ వెంకటేశ్వరవు,తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లేని మంత్రులు దురదృష్టం : వెనిగండ్ల

విశాలాంధ్ర-గుడివాడ : రాష్ట్రంలో ప్రభుత్వం ఉందలేదనే సందేహం ప్రతి ఒక్కరికి కలుగుతుందని, ప్రతిపక్ష నాయకులను విమర్శించటానికి, మంత్రిగా ఉన్నా వారి శాఖలపై కనీసం అవగాహన లేని మంత్రులు మన రాష్ట్రంలో ఉండడం దురద్రుష్టకరమాని టిడిపి నాయకుడు వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక సత్యనారాయణపురంలోని జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్‌తో కలసి వెనిగండ్ల రాము మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో వర్షాకాలంలో చిన్న పాటి వర్షానికి పొలాలు మునిపోయాన్నారు. నేడు సాగునీరు అందక వరిపొలాలు ఎండిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకలు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో పలు గ్రంథాలయ శాఖల భవనాల మరమ్మతులకు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కోరుతూ శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ అధ్యక్షతన నగరంలోని వారి చాంబర్లో సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయ భవన మరమ్మతుల కోసం 31 లక్ష రూపాయలను మంజూరు కోరుతూ పరిపాలన ఆమోదం కోసం పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుల వారికి ప్రతిపాదనలు చేశామని, గుడివాడ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయ పాత భవనమును కూల్చి నూతన భవన నిర్మాణానికి 1.85 లక్షల రూపాయలను పరిపాలన ఆమోదం కోసం ప్రతిపాదనలను పంపుటతోపాటు జగ్గయ్యపేట,తిరువూరు శాఖ గ్రంథాలయాలు, , మచిలీపట్నం జిల్లా కేంద్రంలో ఉన్న విద్యుత్ జనరేటర్ల మరమ్మతుల కోసం 26 వేల రూపాయలు నిధులు మంజూరు కోరమన్నారు. ఉంగుటూరు మండలం మానికొండ, పెనుగంచిప్రోలు మండలం కంభంపాడు శాఖ గ్రంథాలయాల్లో నూతన విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటు కోసం నిధులు మంజూరు కోసం అలాగే మరికొన్నిచోట్ల గ్రంథాలయాల్లో మరమతుల కోసం సర్వసభ్య సమావేశం నిర్ణయం తీసుకుని మంజూరు చేయాలని కోరుతూ ఉన్నత అధికారులకు పంపడం జరుగుతుందని ఆమె వెల్లడించారు. ఈ సమావేశంలో వయోజన విద్య ఉపసంచాలకులు హాజీబేగ్, ఉప విద్యాధికారి యు బి సుబ్బారావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి యమ్.వెంకటేశ్వర ప్రసాద్, డిపిఓ ఏవో పి. రవికుమార్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. రవికుమార్ పాల్గొన్నారు.

నిజాయితీ గల పాలకులతోనే గుర్తింపు

విశాలాంధ్ర-చల్లపల్లి : వక్కలగడ్డ సహకార సంఘానికి జాతీయస్థాయిలో గుర్తింపు రావడానికి నిజాయితీ గల పాలకులు ఉండటమే కారణమని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన నేషనల్ కో-ఆపరేటివ్ ఫర్ ఎక్స్పోర్ట్స్ లిమిటెడ్ జాతీయ సింపోజియం లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకొని నేడు వక్కలగడ్డ విచ్చేసిన అధ్యక్షులు సురేంద్రనాథ్ బెనర్జీకి సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జాతీయస్థాయిలో వక్కలగడ్డ సంఘానికి గుర్తింపు రావడం నిజాయితీపరులు పరిపాలన సాగించడమే దానికి నిదర్శనమన్నారు. మొదటినుండి గ్రామాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయడంలో ఇక్కడి నాయకులు ముందుంటారని పేర్కొన్నారు. రైతు సంఘం నాయకుడిగా రైతాంగ సమస్యలను సాధించేందుకు ముందు వరుసలో ఉండే సురేంద్ర నాథ్ బెనర్జీ సహకార సంఘాన్ని ఆదర్శవంతంగా నిలిపారని కొనియాడారు. సన్మాన గ్రహీత హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ మాట్లాడుతూ సొసైటీ ప్రారంభం నాటి నుంచి గత పాలకులు వేసిన బాటలో పయనిస్తూ వారి ఆకాంక్షను ముందుకు తీసుకెళు న్నానని పేర్కొన్నారు. వక్కలగడ్డలో ప్రాథమిక సహకార సంఘాన్ని ఏ లక్ష్యంతో స్థాపించారు ఆ లక్ష్యం దిశగా తాను ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. సంఘం అభివృద్ధికి, జాతీయస్థాయిలో సంఘానికి గుర్తింపు రావడానికి సంఘ సభ్యులు సిబ్బంది రైతులు ఎంతగానో తనకు సహకారం అందించారని పేర్కొన్నారు. సమిష్టి కృషితోనే విజయం సాధించగలిగామన్నారు. తనపై ఎంతో ప్రేమానురాగాలు చూపి ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గ్రామస్తులకు, రైతాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై సురేంద్రనాథ్ బెనర్జీని మేళతాళాలతో ఊరేగింపుగా గ్రామం లోకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబు, సర్పంచ్ వల్లూరి ఉమా, రైతు సంఘం నాయకులు గుత్తికొండ రామారావు, మాలెంపాటి కాంచనరావు, మద్దిపట్ల జగన్మోహ(న్రావు పరుచూరి అంజయ్య, నాదెళ్ల శరత్చంద్ర ప్రసాద్, దాసరి వెంకట రామమోహన్‌రావు, హనుమానుల జగన్మోహన్‌రావు, మోత్కూరు ఏడుకొండలు, అల్లూరి బాబురావు, పాలడుగు రత్నబాబు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, గౌరిపర్తిరాణి, మట్ట నాంచారయ్య, మల్లుపెద్ది బోసు, అట్లూరి వెంకటేశ్వరరావు, దాసి సీతారామరాజు, కైతేపల్లి దాసు, మొగలేశ్వర గుప్తా, హరి రాజేంద్ర బాబు, రత్నగిరి రావు మల్లుపెద్ది రాజా, శేషు సిద్ధ బత్తుల బాలయ్య సిద్దా బత్తుల వాసు, కొల్లూరి శ్రీధర్, నక్క శ్రీను, మల్లు పెద్ది అజయ్, సొసైటీ కార్యదర్శి పుట్టి వెంకటేష్ బాబు, గ్రామ ప్రముఖులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కారు బైక్ ఢీ- ఇద్దరి దుర్మరణం

విశాలాంధ్ర-కృత్తివెన్ను : 216 జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలైన సంఘటన కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామం సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బంటుమిల్లి వైపు నుండి పల్లిపాలెం వైపు కారు వెళుతుండగా భీమవరం నుండి బంటుమిల్లి వైపు యాక్టివా మోటార్ సైకిల్ పై ఇద్దరు వ్యక్తులు వస్తున్నారు. ఎదురుగా వస్తున్న కారు మోటార్ వాహనంలు అమాంతంగా ఢీ కొట్టుకున్నాయి . అదుపుతప్పిన కారు మోటార్ సైకిల్ పై ఉన్న వారిని తోసుకుంటూ ఎడమ వైపుకు వెళ్లి జాతీయ రహదారికి పంట కాలువకు మధ్యన ఉన్న గోడను అమాంతంగా గుద్దుకున్నది. గోడకు కారు గుద్దుకోవడంతో కారుకి గోడకి మధ్యన నలిగిపోయిన ఇద్దరు వ్యక్తులలో ఒక వ్యక్తి ఎగిరి గోడ అవతల పంటకాలువలో పడిపోయాడు. మరో వ్యక్తి అక్కడే అక్కడే మృతి చెందాడు. ప్రమాదం భారిన పడిన వ్యక్తుల శరీర భాగాలు కాళ్లు చేతులు ముక్కలైపోయి ప్రమాద సంఘటన స్థలంలో చెల్లా చెదురుగా పడి బీభత్సా వాతావరణం కనిపించింది. మృతులను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతి చెందిన వారు భీమవరం చెందిన చేబ్రోలు నరసింహారావు చేబ్రోలు నాగేశ్వరరావు లుగా పోలీసులు గుర్తించారు. వీరిద్దరిని ఢీ కొట్టిన కారులో 8 నెలల గర్భిణీ చెకప్ కోసం మూలలంక నుండి భీమవరం ఆస్పత్రికి వెళుతున్నట్లుగా కార్ డ్రైవర్ తెలిపాడు. ఈ ప్రమాదంలో కార్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మోటార్ సైకిల్ నుజ్జు నుజ్జు అయిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై గణేష్ కుమార్ తెలిపారు.

పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మించండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : అభివృద్ధికి అడ్డుపడే మచిలీపట్నం నగరపాలక సంస్థ అధికారుల కు, వైసిపి పాలకవర్గ సభ్యులకు పుట్టగతులు ఉండవని డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ బిల్డింగ్ సాధన కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది, సోడిశెట్టి బాలాజీ రావు తీవ్రంగా విమర్శించారు. మచిలీపట్నంలో ఆయన కార్యాలయంలో శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు సభ్యునిగా ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధి మాటకు కూడా విలువ ఇవ్వని మచిలీపట్నం నగరపాలక సంస్థ అధికారుల తీరు, పాలకుల తీరు ప్రజలు గమనిస్తున్నారని, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర బ్యాంక్ వ్యవస్థాపకులైన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణం విషయంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థలం కేటాయించి న జిల్లా కలెక్టర్ ద్వారా పట్టాభి స్మారక భవనానికి స్థలం కేటాయించినట్లు కలెక్టర్ ద్వారా ప్రభుత్వం జీవో జారీచేసిన మచిలీపట్నం నగరపాలక సంస్థ కౌన్సిల్ ఏజెండాలో రెండు సంవత్సరాల నుండి పెట్టకుండా కాలయాపన చేయడం దుర్మార్గం అని మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్, వైసీపీ పాలకవర్గ సభ్యుల పై ఆయన మండిపడ్డారు. ప్రజల చేత ఎన్నుకోబడిన పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలసౌరి జిల్లా అభివృద్ధి, సమన్వయం పర్యవేక్షణ కమిటీ సమావేశంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ చంద్రయ్య పై మండిపడుతూ మచిలీపట్నం నగరంలో జరిగే అభివృద్ధిని అడ్డుకోవడం సబబు కాదని కమిషనర్ ని ప్రశ్నించడం చూస్తే మచిలీపట్నంలో అభివృద్ధిని ఏ విధంగా అడ్డుకుంటున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలి ఆయన అన్నారు. ఇప్పటికైనా అధికారులు పాలక పక్షం నాయకులు స్వాతంత్ర సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య పట్టాభి స్మారక భవనం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ బిల్డింగ్ సాధన కమిటీ సభ్యులు న్యాయవాది పుప్పాల ప్రసాద్, పి.వి .ఫణి కుమార్, పి ఎస్ ఎస్ ఆర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం అభివృద్ధికి కృషి : ఎంపీపీ కూనసాని

విశాలాంధ్ర-కృత్తివెన్ను : మండల వాణిజ్య కేంద్రమైన లక్ష్మీపురం గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానని ఎంపీపీ కూనసాని గరుడ ప్రసాద్ హామీ ఇచ్చారు. గ్రామంలో దాదాపు 40 లక్షల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం ఎంపిపి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి జోగి రమేష్ సహకారంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఇటీవల గ్రామంలో మండల నిధులు, ఎంపీ నిధులతో నిర్మించిన రోడ్లను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుబ్రమణ్యం, పెడన వైసిపి యూత్ కన్వీనర్ ఆకన సాయి, పులగం రాము, కూనసాని వీరస్వామి, పులగం శ్రీనివాసరావు, పులగం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ... పంట నమోదు ముసాయిదా

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో శుక్రవారం ఈ క్రాప్ నమోదు ముసాయిదా జాబితాను వ్యవసాయ సహాయకులు ప్రకటించారు. దీనిలో భాగంగానే కూచిపూడి సచివాలయ పరిధిలో గల రైతుభరొసాకేంద్రంలో మండల వ్యవసాయ అధికారి కంచర్ల శివప్రసాద్ ఈ ముసాయిదా లిస్టును విడుదల చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో ఈనెల 29 వరకు రైతుల పరిశీలనార్థం ఆర్.బి. కేంద్రాల్లో ముసాయిదా లిస్టునుఉంచుతామన్నారు. దీనిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆ సచివాలయ వ్యవసాయ సహాయకులను సంప్రదించి అభ్యంతరాలను రాతపూర్వకంగా అందజేయాలని కోరారు. అభ్యంతరాలను పరిశీలించి 29 తర్వాత తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. కూచిపూడి, బార్లపూడి గ్రామాలలోని ఆయకట్టులో గల రైతులతోపాటు జె.సోమేశ్వర కుమార్ పాల్గొన్నారు.

ఓటర్లలిస్టు ప్రకటన

విశాలాంధ్ర -కూచిపూడి : మొవ్వ మండలంలోని 21 గ్రామాలలో గల 54 పోలింగ్ కేంద్రాలలో 41,337 మంది ఓటర్లకు సంబంధించిన ముసాయిదా కాపీని శుక్రవారం సాయంత్రం తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ ప్రకటించారు. ఈ సందర్భంగా 54 పోలింగ్ కేంద్రాల అధికారులతో సమావేశం నిర్వహించారు. కొత్త ముసాయిదాఓటర్ల లిస్టులో చేర్పులు, మార్పులు, తొలగింపులు, సవరణలు 27వ తారీకు నుంచి డిసెంబరు 9వ తారీకు వరకు అవకాశం ఉంటుందని పోలింగ్ కేంద్ర అధికారులు ఆయా కేంద్రాలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. మండలంలో గల 41,337 ఓటర్ లో మహిళలు 21,208 కాగా, 20,127 పురుషులని, ఇద్దరు జెండర్స్ అని వివరించారు.

దోమల నివారణకు చర్యలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : దోమల నివారణకు పంచాయితీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. పంచాయితీ పరిధిలోని కొత్తపేట, రామకోటిపురం ప్రాంతాల్లో పంచాయితీ వారు ఏర్పాటు చేసిన ఫాగింగ్ మిషన్ ద్వారా పూర్తి స్థాయిలో ఫాగింగ్ నిర్వహించారు. దోమల నివారణకు పంచాయితీ అధికారులు ప్రతివారం క్రమం తప్పకుండా ఫాగింగ్‌తో పాటు డ్రైనేజీలలో దోమల నివారణకు చర్యలు చేపడితే దోమలను సమూలంగా నిర్మూలించవచ్చని గ్రామస్థులు పంచాయితీ అధికారులను కోరుతున్నారు. పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణలు ఫాగింగ్‌ను పరిశీలించారు.

సామాజిక సాధికార యాత్ర ఒక బూటకం : కొనకళ్ల

విశాలాంధ్ర-మచిలీపట్నం : కల్లబొల్లి మాటలతో జగన్ యాత్ర చేస్తున్నారని మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణ రావు మండిపడ్డారు. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులతో పార్లమెంట్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నిర్వహిస్తున్న సామజిక సాధికార దగా యాత్ర అన్నారు. జగన్ నా ఎస్సీ, నా బీసీ, నా మైనార్టీలు అంటూ అందరికిద్రోహం చేస్తున్నాడు. 56 బీసీ కార్పొరేషన్ లు వేసాడు ఒక్క రూపాయి నిధులిచ్చాడా, కనీసం కూర్చునేందుకు కుర్చీకూడా ఇవ్వ కుండా ద్రోహం చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని ఆయన అన్నారు. రాష్ట్ర, దేశ చరిత్రలో మునెపెన్నడూ బీసీ లకు చేయని దగా జగన్ ఉన్నాడని ఆయన దుయ్యబట్టారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రగతిని ఒక హక్కుగా మన ప్రభుత్వం అందించాలి కానీ ఈ జగన్ ప్రభుత్వం ఒకే కులానికి రాష్ట్ర సంపద దోచి పెడుతున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పామర్రు ఇంచార్జి వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ జగన్ దళితుల మేనమామ కాదు కంసమామ దళితుడిని చంపిన అనంతబాబు జగన్ స్నేహితుడు అంబేద్కర్ విదేశి విద్యకు తన పేరు పెట్టుకున్న జగన్‌కు దళితులపై ప్రేమ ఉందా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. మైనారిటీ పార్లమెంట్ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా మాట్లాడుతూ ఈ వైసీపీ దుర్మార్గపు ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ నిధులు దారి మళ్లించి కార్పొరేషన్ నిర్వీర్యం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య, ఐబీసీ కరుణ్ కుమార్, బచ్చుల బోస్, కార్పొరేటర్, రాష్ట్ర సూర్య బలిజ కన్వీనర్ రాళ్ల కొట్టు రాము, మాజీ జడ్పీటీసీ లంకె నారాయణ్ ప్రసాద్, పార్టీ అధ్యక్షులు ఇలియాస్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌కు తెలుగు తమ్ముళ్ల నిరసన

విశాలాంధ్ర-అవనిగడ్డ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ ను నిరసిస్తూ నియోజకవర్గ ప్రధాన కేంద్రం అయిన అవనిగడ్డలో తెలుగు తమ్ముళ్ళు మోకాళ్ళపై ఉండి నిరసన తెలియచేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు బండె శ్రీనివాసరావు, కర్రా సుధాకర్, దిరిశం బాలకోటయ్య, మేడికొండ విజయ్, మండలి రాంమోహన్‌రావు, విశ్వనాధుని మురళి, కూరాకుల ప్రసాద్, నేతలు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

విశాలాంధ్ర-అవనిగడ్డ : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 2023 పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్.పి జాషువా ఆదేశాల మేరకు అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో సి.ఐ ఎల్ రమేష్ పర్యవేక్షణలో అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి స్టేషన్‌లో వ్యాసరచన, డిబైట్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను త్వరలో ఎస్పీ చేతుల మీదుగా ఇస్తారని సి.ఐ చెప్పారు. అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని అవనిగడ్డ, నాగాయలంక, చల్లపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ లు జి రమేష్, సుబ్రహ్మణ్యం, చిన్నబాబులతో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాదీ మహోత్సవ వక్తృత్వ పోటీలు

విశాలాంధ్ర-పెదపారుపూడి : పెదపారుపూడి జెడ్పీ పాఠశాలలో మండల స్థాయి వక్తృత్వ పోటీలు శుక్రవారం జరిగాయి. మొదట బహుమతి జి అను పదవ తరగతి జడ్పీహెచ్ఎస్ పెదపారు పూడి, ద్వితీయ బహుమతి ఆర్ యామిని ఎంపియుపిఎస్ ఈదుల మద్దాల, తృతీయ బహుమతి టి జాన్ కృపానిది పదవ తరగతి పెదపారుపూడి, అలాగే వ్యాసరచన పోటీలలో మొదట బహుమతి కె స్వాతి పదవ తరగతి జడ్పీహెచ్ఎస్ యలమర్రు, ద్వితీయ బహుమతి బి సాయి నిషిత 8వ తరగతి ఎంపియుపిఎస్ చినపారుపూడి, తృతీయ బహుమతి జి అను పదవ తరగతి జడ్పీహెచ్ఎస్ పెదపారుపూడి, పొందారని ఎంఈఓ :1 బి శ్రీనివాస్, ఎంఈఓ: 2 వి సురేష్ లు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలైన విద్యార్థులను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ వరుణ్ కుమార్, ఎం భవాని అభినందించారు.

42వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో విజేతలు

విశాలాంధ్ర-పెదపారుపూడి : 42వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల ఖోఖో ఆటల విభాగంలో చిత్తూరు జిల్లా యాదమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 20, 21, 22, తేదీలలో జరిగిన పోటీలలో యలమర్రు జెడ్పీ పాఠశాలకు చెందిన టి జయరామ్ (పదవ తరగతి) ,డి శివ సాయి కృష్ణవేణి (పదవ తరగతి), జి అనిత (8వ తరగతి), డి చరిత (8వ తరగతి), ఎస్ సుప్రజ (7వ తరగతి), విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని ప్రశంస పత్రాలు పొందినారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావెళ్ల వరుణకుమార్ శుక్రవారం తెలిపారు.

ప్రతి పేదవానికి నాణ్యమైన వైద్యం : ఎమ్మెల్యే వంశీ

విశాలాంధ్ర-గన్నవరం : ప్రతి పేదవారికి నాణ్యమైన వైద్యం అందించాలని సియం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం అని ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని దావాజిగుడెం జడ్పీ హైస్కూల్‌లో జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వంశీమోహన్, సర్పంచి బడుగు బాలమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యులు అన్నవరపు ఎలిజబెత్ రాణి, గొంది పరందమయ్యా, సర్పంచి బడుగు బాలమ్మ, గౌసాని,ఉప సర్పంచి వేల్పూరి బసవరవు, అల్లపురం సర్పంచి దొక్కు వెంకన్నబాబు, ఈ ఓ సత్తిబాబు, డా హిమబిందు, కరిముళ్ళ, ఏ ఎన్ యం లు, ఆశలు, అంగనివాడి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 16 లక్షల 39 వేల 542 మంది ఓటర్లు : కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా-2024లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం 16 లక్షల 39 వేల 542 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఏడు నియోజక వర్గాల్లో 8 లక్షల 02 వేల 09 మంది పురుషులు, 8 లక్షల 36 వేల 986 మంది స్త్రీలు, 157 మంది థర్డ్ జెండర్, 390 సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. తిరువూరు నియోజకవర్గంలో 99 వేల 241 మంది పురుషులు, 1 లక్ష 01 వెయి 363 మంది స్త్రీలు, 9 మంది థర్డ్ జెండర్లు, 44 మంది సర్వీస్ ఓటర్లు మొత్తంగా 2 లక్షల 657 మంది ఉన్నట్లు తెలిపారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 1లక్ష 21 వేల 538 మంది పురుషులు, 1లక్ష 23 వేల 888 మంది స్త్రీలు, 34 మంది థర్డ్ జెండర్లు, 60 సర్వీస్ ఓటర్లతో మొత్తంగా 2లక్షల 45 వేల 520 మంది ఉండగా, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 1లక్ష 32 వేల 902 మంది పురుషులు, 1లక్ష 38వేల 615 మంది స్త్రీలు, 59 మంది థర్డ్ జెండర్లు, 68 సర్వీస్ ఓటర్లతో మొత్తంగా 2 లక్షల 71 వేల 644 మంది ఉండగా, తూర్పు నియోజకవర్గంలో 1లక్ష 26 వేల 150 మంది పురుషులు, 1లక్ష 30 వేల 967 మంది స్త్రీలు, 17 మంది థర్డ్ జెండర్లు, 74 సర్వీస్ ఓటర్లతో మొత్తంగా 2లక్షల 57 వేల 208 మంది ఉన్నట్లు తెలిపారు. మైలవరం నియోజకవర్గంలో 1లక్ష 30 వేల 824 మంది పురుషులు, 1లక్ష 37 వేల 943 మంది స్త్రీలు, 18 మంది థర్డ్ జెండర్లు, 50 సర్వీస్ ఓటర్లతో మొత్తంగా 2 లక్షల 68 వేల 835 మంది ఉండగా, నందిగామ నియోజకవర్గంలో 96 వేల 418 మంది పురుషులు, 1 లక్ష 2 వేల 189 మంది స్త్రీలు, 9 మంది థర్డ్ జెండర్లు, 45 సర్వీస్ ఓటర్లతో మొత్తంగా 1 లక్ష 98 వేల 661 మంది ఉన్నట్లు చెప్పారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో 94 వేల 936 మంది పురుషులు, 1లక్ష 02 వేల 021 మంది స్త్రీలు, 11 మంది థర్డ్ జెండర్లు 49 సర్వీస్ ఓటర్లతో మొత్తంగా 1 లక్ష 97 వేల 17 మంది ఓటర్లగా నమోదైనట్లు తెలిపారు.

నేడు సీ.రాఘవాచారి 4వ వర్థంతి

విశాలాంధ్ర-విజయవాడ : అక్షర వస్త్రధారి చక్రవర్తుల రాఘవాచారి 4వ వర్ధంతి సభ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఊర్వశీ ఐనాక్స్ సెంటర్‌లో జరుగుతుందని సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. రాఘవాచారి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : కౌలురైతులందరికి భూయజమానితో సంబంధం లేకుండానే పంటరుణాలు ఇవ్వాలని నవంబర్ 10 జిల్లాలోని లీడ్ బ్యాంకుల వద్ద ధర్నాలు చేయాలని కౌలురైతులసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలో రైతు సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ సమావేశంలో పి.జమలయ్య మాట్లాడుతూ, ఈ ఎడాదీ కౌలురైతులకు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం బ్యాంకులు పంటరుణాలు ఇవ్వలేదని రబీలోనైనా కౌలురైతులకు భూ యజమానితో సంబంధం లేకుండానే కౌలురైతులందరికి పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది వ్యవసాయ రంగానికి కోటి 30 లక్షల రూపాయల పంటలు రుణాలు ఇస్తే కౌలురైతులకు మాత్రం కేవలం రూ.518 కోట్లు మాత్రం ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. 80 శాతం భూమిలో పంటల పండిస్తున్న కౌలురైతులకు పంట రుణాలు అందించకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకున్న టార్గెట్ ప్రకారమైన రూ.4 వేల కోట్ల మేరకు పంట రుణాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో కౌలురైతులు లేనిదే వ్యవసాయం లేదన్నారు. బ్యాంకులు అప్పులు ఇవ్వకపోవడంతో నూటికి రెండు రూపాయల నుంచి ఐదు రూపాయలకు ప్రవేటు వడ్డీ వ్యాపారల దగ్గర వడ్డీకి అప్పులు తెచ్చి పంటలు పండిస్తున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కౌలురైతులను దృష్టిలో పెట్టుకుని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలుమంజూరు చేయాలని, ఆర్బీఐ నిబంధనల ప్రకారం రూ.1,60,000 వరకు ఎటువంటి షూరిటీ లేకుండానే కౌలురైతులకు రైతులకు పంట రుణాలు అందించాలని, సిసిఆర్సి లేని కౌలు రైతులకు జాయింట్ లైయబులిటీ గ్రూపులు ఏర్పాటు చేసి సున్నా వడ్డీ పథకాన్ని వర్తింప చేయాలని కోరారు.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు నవంబర్ 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో లీడ్ బ్యాంకుల వద్ద ఆందోళన నిర్వహించాలని పిలుపునిచ్చారు. యన్ ఆర్ జిల్లాలో పత్తి మిర్చి, ధాన్యం తదితర పంటలు సాగునీరు లేక ఎండిపోతున్నాయని కౌలుతోపాటు లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టి కళ్ళు ఎదుటే పంటలు ఎండిపోతుంటే కౌలు రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని, నిలువునున్న పంటలను రక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుసంఘం నాయకులు మల్నీడు యలమందారావు మాట్లాడుతూ పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కౌలురైతుల సదస్సు అక్టోబర్ 30న ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తున్నట్లు మల్నీడు యలమదారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు కన్నా వెంకటేశ్వరరావు, కౌలురైతుల సంఘం రాష్ట్ర నాయకులు పెయ్యల వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-గంపలగూడెం : వ్యవసాయరంగ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని మేడూరు సచివాలయం ఎదుట శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసి సచివాలయం కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చిలుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అనావృష్టితో వేలాది ఎకరాలు పంట పొలాలు ఎండిపోయి, కౌలు రైతులు వేలాది ఎకరాలలో పెట్టుబడులు పెట్టి పంట చేతికందే సమయానికి వర్షాలు లేక ఎండుతున్న పైర్లను చూసి రైతు కంట కన్నీళ్లు వస్తున్నాయని అన్నారు. వ్యవసాయ కూలీలకు గ్రామాలలో పంటలు లేక పనులు దొరకక పట్టణాలకు ,వేరే ప్రాంతాలకు తరలి వెళుతున్నారని అన్నారు. ఇంత కరువు తీవ్రత ఉన్న ఈ జిల్లాను పూర్తిగా కరువు మండలాలగా ప్రకటించి వ్యవసాయాన్ని నమ్ముకుని కూలీలుగా బతుకుతున్న వ్యవసాయ కూలీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక చేయూతను కల్పించి, గ్రామాలలో కూడా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వము ప్రత్యేకమైనటువంటి నిధులు కేటాయించాలని, జాబు కార్డుతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి పని చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వము ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక కరువు బత్యం కింద ఇవ్వాలని, కుటుంబానికి 35 కేజీలు బియ్యం, అన్ని రకాల నిత్యవసర సరుకులు అందించాలని, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఈ వేసవిలో మంచి నీళ్లు ట్యాంకర్ల ద్వారా అందించాలని ,ఫ్లోరైడ్ సమస్య ఉన్న అన్ని మండలాల్లో తండాలకు కృష్ణ వాటర్ ను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం తిరువూరు నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ .నాగుల మీరా మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వేసవి దృష్ట్యా ముందు చూపుగా మంచినీళ్ల సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని, అన్ని ప్రాంతాలలో ఉపాధి హామీ పనులు ప్రారంభం చేసి పనులు కల్పించాలి, ఈ కరువు నేపథ్యంలో కార్పొరేటు స్కూళ్లలో చదువుతున్న కూలీల విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల ఫీజులు చెల్లించాలి, అనావృష్టితో కరువు అనే ఈ మహామారి నుంచి గ్రామీణ కష్టజీవులను రక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో ఆంబలకేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తిరువూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఉన్నం సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కూరపాటి చిట్టిబాబు, గవరాజు రామకృష్ణ, ఉపాధి హామీ కూలీలు కె ఇమాయిల్, ఇస్సాకు మోష, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్ మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ ను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శుక్రవారం ప్రారంభించారు.అనంతరం మార్కెట్లోని పలు స్టాళ్లను సందర్శించి, పొదుపు సంఘాల మహిళలతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ చేయూత, ఆసరా తో పాటు సున్నా వడ్డీ రుణాలతో లబ్ధి పొందిన పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కోసం అర్బన్ మార్కెట్లు చక్కటి వేదిక అన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణం గా మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించటం మెప్మా లక్ష్యమని పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను విక్రయించుకోవడానికి వాటిని మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ని పొదుపు సంఘాల మహిళలు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గగుడి మూసివేత

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పాక్షిక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఈనెల 28వతేదీ సాయంత్రం 6:30గంటలకు ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలను మూసివేస్తున్నట్లు దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు ఒక ప్రకనటలో పేర్కొన్నారు. 29వతేదీ ఉదయం కవాట ఉద్ఘాటన అనంతరం స్నపనాభిషేకం, అలంకరణ పూర్తయిన తరువాత ఉదయం 9గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామన్నారు. ఉదయం నిర్వహించే సుప్రభాత సేవ, వస్త్ర సేవ, ఖడ్గమాలార్చన నిలిపివేసినట్లు పేర్కొన్నారు. 9గంటల తరువాత నిర్వహించే అన్ని ఆర్జిత సేవలు ఎప్పటిలాగానే జరుగుతాయన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఆర్డీవో రవీంద్రరావును కలెక్టర్ ఢిల్లీ రావు, ఎమ్మెల్యే డాక్టర్ జగన్ మోహన్‌రావులు శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వినూత్న ఆలోచనలతో పనిచేస్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని వేగవంతంగా పరిష్కరించేందుకు 1902 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటుచేసి జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని కూడా రూపొందించి జిల్లా స్థాయి, మండల స్థాయిలో కూడా అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, కల్యాణమస్తు, షాదీతోఫా తదితర సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజలకు ఏవైనా వ్యక్తిగత స్థాయిలో సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి విన్నవించుకోవచ్చని అలాగే భూముల మ్యూటేషన్స్, పట్టాదారు పాసుపుస్తకాలు, రేషన్‌కార్డులు, పెన్షన్ కానుక, ఆరోగ్యశ్రీ సేవలు వంటివి పొందాలనుకునే వారు కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతులు సమర్పించుకోవడానికి రూపకల్పన చేశారన్నారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందన్నారు.జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ ఢిల్లీ రావు చెప్పారు. ప్రభుత్వ అధికారుల పనితీరు బాగుంటేనే పాలన కూడా సంతృప్త స్థాయిలో సాగుతుందనే ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెడతా మన్నారు. సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరిస్తూ అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా చూస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, మండల, డివిజన్, జిల్లా స్థాయి వరకు కార్యక్రమం వంద శాతం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. వినతులను పారదర్శకంగా, నాణ్యంగా పరిష్కరిస్తా మని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మలక్ బషీర్, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జున రావు, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, సర్పంచ్ వేల్పుల సునీత, ఉప సర్పంచ్ వేమ సురేష్ బాబు, ఆర్డీవో రవీంద్ర రావు, ఎంపీడీవో బాల శంకర్, ఎమ్మార్వో శంకర్ బాబు, పంచాయతీ సెక్రటరీలు, అధికారులు, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జగన్న ఆరోగ్యం సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే వీ.శ్రీనివాసరావు, నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి అన్నారు. 40, 42, 45, 48, 53, 55వ డివిజన్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్యాంపులకి విశేష స్పందన వచిందని, ప్రతి ఒక్కళ్ళు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఇంటికి వెళ్ళి 7 రకాల టెస్టులు చేసి, ఆ టెస్టుల్లో ఆరోగ్య సమస్యలున్నట్లు తేలితే వారికి అవసరమైన మందులు, ఎంత పెద్ద చికిత్సకైనా ఆరోగ్యశ్రీ ద్వారా వ్యాధి నయం అయ్యేవరకు కూడా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం చికిత్స అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అంజనేయరెడ్డి, చైతన్యరెడ్డి, మాధురి లావణ్య, కృష్ణ, ఆదిలక్ష్మి, పెద్దబాబు, అప్పజీరావు, పూర్ణచంద్రరావు, జిల్లా వైద్య శాఖ అధికారి సుహాసిని పాల్గొన్నారు.

డయల్ యువర్ సీపీకి 9 ఫిర్యాదులు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి శుక్రవారం జరిగే డయల్ యువర్ పోలీస్ కమీషనర్ కార్యక్రమంలో తొమ్మిది ఫిర్యాదులు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. ఇందుకోసం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866-2490613 అనే నెంబర్ కు ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ కమీషనర్ గారికి తెలియజేశారు. వీటిలో ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక శక్తుల, కుటుంబ కలహాలు, ఆర్థికనేరాలు, స్థలం తగాదాల, మొదలుగునవి మొత్తం 09 కాల్స్ చేయగా పోలీస్ కమీషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ యస్.హెచ్.ఓ.లతో, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించే దిశగా ఆదేశాలు జారి చేశారు. డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలకు సత్వర పరిష్కారం చేసేందుకు, పోలిసుల పట్ల విశ్వాసాన్ని కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందని కాంతి రాణా తెలిపారు.

బెజవాడలో జార్ఖండ్ దొంగలు !

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): బెజవాడలో జార్ఖండ్ దొంగలు చొరపడ్డారు. అర్ధరాత్రి ఇళ్ళలో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ ఘటన శుక్రవారం విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రాజరాజేశ్వరిపేటకు చెందిన వినయ్ కుటుంబ సభ్యులతో కలిసి అర్ధరాత్రి ఇంట్లో నిద్రపోయారు. గుర్తుతెలియని దుండగులు ఇంట్లో ప్రవేశించి మూడు సెల్‌ఫోన్లు చోరీ చేశారు. ఇంట్లో శబ్దం రావడంతో స్థానికులు లేచి చూసేరికి పారిపోతున్న దుండగులను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దుండగులను తనిఖీ చేయగా జార్ఖండ్ వాసులుగా గుర్తించారు. వారి వద్ద మూడు సెల్‌ఫోన్లు, మాంసం కొట్టే కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు పోలీసులు విచారిస్తున్నారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా జీ.కొండూరు మండలం, కవులూరు గ్రామంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు రెండు సెల్‌ఫోన్లు చోరీ చేశారు. ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్లు తీసుకుని బైక్ పై పరారైయ్యారు. ఈ ఘటన పై జీ.కొండూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలకు వంట పాత్రలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : కృష్ణలంక 22వ డివిజన్‌లోని ఎస్వీ రెడ్డి నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద పథకం కింద వంట పాత్రలు అందజేసినట్లు స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉన్నతమైన విద్యతో పాటు నాణ్యమైన ఆహారాన్ని కూడా అందిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ఆహారాన్ని వండేందుకు అవసరమైన వంట పాత్రలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాల స్థాయి వాలీబాల్ క్రీడలు ప్రారంభం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: గొంతెమ్మ పండుగను పురస్కరించుకుని 34 ఏళ్లుగా అంబేద్కర్ యువజనసంఘం ఆధ్వర్యంలో తాతకుంట్ల పంచాయతీ శివారు మిట్టగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగా రెండు రాష్ట్రాల స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభించారు. ఈ పోటీలను గ్రామ ప్రముఖులు, నిర్వాహక కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రముఖుల చేతుల మీదుగా నగదు పురస్కారాలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర వ్యాయామోపాధ్యాయసంఘం నాయకుడు ఎం.రమేష్ ఆధ్వర్యంలో జరిగే ఈ క్రీడలు ఆనెల 29వ తేదీన తుది పోటీలు జరుగుతాయని వారు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-విజయవాడ : సూర్యారావుపేట సెక్షన్, జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్, 11 కేవీ కస్తూరిబాయిపేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం 8 నుండి 10.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఏపీసీపీడీసీయల్ విజయవాడ టౌన్ కార్యనిర్వహక ఇంజనీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సరఫరా నిలుపు ప్రదేశాలు :- గోపాలరెడ్డి రోడ్, రైల్వే క్లబ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్, ఇంటెలిజెన్స్ ఆఫీస్, కస్తూరిబాయిపేట పుష్పా హోటల్ ఏరియా, కాశేశ్వరావు రోడ్, ప్రకాశం రోడ్ లతా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏరియా, పొగాకు బ్యారెన్ రోడ్, కస్తూరిబాయి పేట బెల్లపు శోభబాద్రి వీధి, రామనాధం వీధి, చలమల వారి వీధి ఏరియాలలో విద్యుత్ సరఫరా ఆపబడునని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిద్ధమవుతున్న ఇన్ఫో, ఐకానిక్ పార్కులు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర వాసులకు అభివృద్ధితో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు సింగ్‌నగర్‌లో ఇన్ఫో, ఐకాన్ పార్కులు సిద్ధం చేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్, డంప్ యార్డ్‌లో నిర్మిస్తున్న ఇన్ఫో పార్క్, ఐకానిక్ పార్క్ పనులను కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. పార్కుల పనులు గడువులోపు పూర్తి చెయ్యాలని శివారు ప్రాంత వాసులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అంతకు ముందు చెత్త డంప్‌సైట్‌గా ఉన్న ఈ ప్రాంతాన్ని ఇప్పుడు ఒక అందమైన ఆహ్లాదకరమైన పార్కుగా తీర్చుదిద్దుతున్నట్లు తెలిపారు. ఐకానిక్ ప్లాజా పార్కుల్లో ఓపెన్ జిమ్, బ్యాడ్మింటన్, ఫాస్ట్ ట్రాక్స్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందిని అజిత్ సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌లోని 9 ఎకరాల స్థలంలో 14, 15వ ఆర్థిక సంఘం, కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.10 కోట్లతో ఈ పార్కు నిర్మాణం జరుగుతోందన్నారు. పార్కులో చిన్నారులకు ఆనందాన్ని పంచేలా అన్ని రకాల ఆటపరికరాలతో పాటు పెద్దలకు స్పోర్ట్స్ జోన్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. బ్యాడ్మింటన్, వాలీబాల్, జిమ్, ఫాస్ట్ ట్రాక్, పార్కులో ఆహ్లాదకరంగా ఉండేలా గ్రీనరీ ఏర్పాటు, రాత్రివేళ్లలో ఆకర్షణీయంగా ఉండే లైట్లు ఈ పార్కుకు హైలెట్‌గా నిలుస్తుందన్నారు. ఇన్ఫర్మేషన్ పార్కు, ఎక్సెల్ ప్లాంట్‌లో ఫ్లవర్ వేస్ట్ మేనేజ్మెంట్, విండో కంపోస్టింగ్, వర్మి కంపోస్ట్, బయో మిథనేషన్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మ్యానేజ్మెంట్, మినీ సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్, ట్రీ వేస్ట్ ప్రాసెసింగ్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ స్క్రాప్, స్క్రాప్ ప్లేసింగ్, మాట్రెస్స్ వేస్ట్ ప్రాసెసింగ్, సీ అండ్ డీ వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్‌ల గురించి త్రీడి పద్ధతిలో ప్రత్యక్షంగా విద్యార్థులకు, పిల్లలకు, ప్రజలకు సమాచారాన్ని అందించనున్నట్లు తెలిపారు. పార్కు ఆవరణలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో వీఎంసీ అడిషనల్ కమిషనర్ కే.సత్యవతి, ఈఈ ఏఎస్ఎన్.ప్రసాద్, పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

విశాలాంధ్ర-ఎ కొండూరు : రాష్ట్ర ప్రజలందరికీ కులమత బేధాలు లేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సుభిక్షమైన పరిపాలను అందిస్తున్నారని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలం గొల్లమందల గ్రామంలో రూ 45 లక్షల వ్యాయంతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం విద్య వైద్యం కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమేతియంగా ప్రతి గ్రామంలో సచివాలయ భవనంతో పాటు రైతులకు ఉపయోగపడే విధంగా ఆర్.బి.కె కేంద్రాలు ఆరోగ్య కేంద్రాలను నిర్మించి రాష్ట్రంలో నూతన ఒరవడిని సృష్టించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఆయన అన్నారు నిరంతరం ప్రజల కోసమే ఆలోచిస్తున్నా మన ముఖ్యమంత్రి జగన్ అన్నను మరల ముఖ్యమంత్రిని చేసి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి సరిత ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి చెన్నారావు జడ్పిటిసి భూక్య గనియ గొల్లమండల తండా సర్పంచ్ ధారావత్ రాముడు మాజీ జెడ్పిటిసి పాలెం ఆంజనేయులు వజ్రాల బ్రహ్మారెడ్డి కోట పుల్లారావు ఎంపీటీసీ పిన్నిబోయిన రజిని మండలంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణం లోని 13 వ వార్డు, మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం పరిసర ప్రాంతంలో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శంఖు స్థాపన చేసారు. చైర్మన్ మాట్లాడుతూ చాలా రోజుల నుంచి రోడ్డు సరిగ్గా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కౌన్సిలర్ కాటగాని శివకుమారి నరసింహారావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకి తెలియజేయగా ప్రభుత్వ ప్రత్యేక నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టామని, అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తూ రోడ్డు నిర్మాణం నాణ్యతతో జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు తుమ్మల ప్రభాకరరావు, షేక్ హాఫిజున్నిసా ఫిరోజ్ ఖాన్,మున్సిపల్ కమిషనర్ నాగ మల్లేశ్వర రావు, కౌన్సిలర్ కాటగాని శివకుమారి నరసింహరావు,వార్డు నాయకులు పోలకం సైదులు,షేక్ సైదులు, రెబ్బా నరసింహ రావు,సతీష్(బద్ర), మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు ఖండిస్తూ అర్ధ నగ్న ప్రదర్శన

విశాలాంధ్ర-కంచికచర్ల: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ కు నిరసనగా అర్ధనగ్నంగా మోకాళ్ళ మీద కూర్చుని కంచికచర్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో నిరసన తెలియ జేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు కోగంటి బాబు మాట్లాడుతూ అధికార పార్టీ ఎన్ని కుట్రలు మోపిన ఎన్ని కేసులు పెట్టిన నారా చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యం లా నిర్దోషిలా బయటకు వస్తారని అన్నారు. చంద్రబాబు నాయుడు ను జైల్లో పెట్టి లబ్ధి పొందామనుకునే వారికి ముందు ముందు ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తారత్నం, గుత్తా ఓంకార్ తాడపనేని లక్ష్మీనారాయణ, బుద్ధి సూరి ప్రకాష్, నన్నపనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఓపెన్ హౌస్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీ నగర్) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం రైల్వే ఎస్పీ కార్యాలయంలో రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ అదేశాలు మేరకు రైల్వే డీఎస్పీ పి.నాగరాజురెడ్డి ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ప్రజల రక్షణ,ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసుల విధివిధానలు గురించి వారు ఉపయోగించే ఆయుధాలు ,ఇతర అంశాలు గురించి ప్రజలకు తెలుసుకొవాలనే ఉచ్చకత ఉంటుందన్నారు. అమరవీరుల సంస్మరణ దిరోత్సవ వారోత్సవాల్లో భాగంగా అన్ని రకాల అయుధాల పనితీరును ఓపెన్ హౌస్ ద్వారా ప్రజలకు,విద్యార్థులకు ప్రదర్శించి వివరించటం జరుగుతుందన్నారు.నేటి ఓపెన్ హౌస్‌లో పాల్గొన్న సిద్ధార్థ లా కాలేజీ విద్యార్థులకు,ప్రొఫెసర్స్ సిహెచ్ శ్రీనివాసరావు, అనురాధ,పుష్ప, కిరణ్ పోలీస్ ఆయుధములైన 303, ఎల్.ఎం.జి, ఎస్.ఎల్.ఆర్, ఏకే 47,కార్బన్,రివాల్వర్ పిస్టల్,స్టోన్ గార్డ్ ల ఉపయోగము గురించి అవి పని చేయు విధానం వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు సి.శ్రీనివాసరావు,సురేష్,యు.బంగారు రాజు,సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరులో పోలీసు తనిఖీలు

విశాలాంధ్ర-వీరులపాడు: నందిగామ ఏసిపి జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ ను వీరులపాడు మండలం అల్లూరు గ్రామంలో పోలీస్ సిబ్బంది శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నందిగామ నాగేంద్ర కుమార్, కంచికచర్ల చందర్లపాడు మండల ఎస్సైలు పాల్గొన్నారు. ఈ సోదాలలో అల్లూరు గ్రామానికి చెందిన పల్లె ఏసురత్నం,ముంగి సీతయ్య ల వద్ద నుండి 100 క్వార్టర్ బాటిల్స్ ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.అదేవిధంగా మండలంలోని తెలంగాణ సరిహద్దు గ్రామాలైన పెద్దాపురం,జయంతి గ్రామాల సరిహద్దు సరిహద్దులలో ఎస్సై మహాలక్ష్ముడు వారి సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ నుండి మద్యం,గంజాయిల వంటి మాదకద్రవ్యాలు తీసుకువచ్చిన కఠిన శిక్షలు విధిస్తామని తెలిపారు.

రూ.56 వేల వెండి పళ్లెం విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారికి ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం గ్రామ వాస్తవ్యులు అచ్యుత లక్ష్మణరావు రామరత్నం దంపతులు వారి కుమారులు పెద్ద సతీష్ చిన్న సతీష్ సుమారు 800 గ్రాముల పూల డిజైన్ కల సుమారు 56 వేల రూపాయల ఖరీదు చేసే వెండి పళ్లెం విరాళంగాఆలయ అధికారులకు అందజేశారు.అనంతరం వారికి ఆలయ వేద పండితులు పూజారులు ప్రత్యేక పూజలు జరిపి ఆశీర్వాదించి తీర్ద ప్రసాదాలు అందజేశారు.

సెలెవిడా వెల్‌నెస్‌ను ప్రారంభించిన డాక్టర్ రెడ్డీస్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): గ్లోబల్ ఫార్మాస్యూటికల్ కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్, తన పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ స్వాస్ వెల్‌నెస్ లిమిటెడ్ ద్వారా మధుమేహ రోగుల కోసం తన మొదటి డైరెక్ట్-టు-కన్స్యూమర్ ఇ-కామర్స్ వెబ్‌సైట్ 'సెలెవిడా వెల్‌నెస్'ని ప్రారంభించామని ప్రకటించింది. టైప్ 2 దయాబెటిక్, ప్రీ-డయాబెటిక్ వ్యక్తుల కోసం వ్యక్తిగతీకరించిన దయాబెటిక్ సంరక్షణ అందించేందుకు 'సెలెవిడా వెల్‌నెస్' ఒన్-స్టాప్ పరిష్కారంగా మారాలని లక్ష్యంగా పెట్టుకుంది. దయాబెటిక్ రోగి రోజువారీ పోషకాహార అవసరాన్ని చూసుకునే, అదే సమయంలో రోజులో మొత్తం పూర్తి సందర్భానికి గతిన ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను అందించేందుకు వెబ్‌సైట్ సెలెవిడా శ్రేణి ఉత్పత్తులను, అలాగే ఇతర థర్డ్ పార్టీ బ్రాండ్‌లు అంటే, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, స్నాక్స్, పానీయాలు, భోజనం రీప్లేస్‌మెంట్ మొదలైన వాటిని హోస్ట్ చేస్తుంది. ఉత్పత్తులు వాటి పోషక కూర్పుపై కఠోరమైన శ్రద్ధతో కూడిన అధ్యయనంతో, కఠినమైన ఉత్పత్తి ఎంపిక ప్రక్రియ తర్వాత ప్లాట్‌ఫారమ్‌లో అందుబాటులో ఉంచుతారు. వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఉత్పత్తులను ప్రస్తుతం భారతదేశం వ్యాప్తంగా 18,000 కన్నా ఎక్కువ పిన్ కోడ్‌లకు సేవలు అందించనున్నారు.

దీపావళి షాపోత్సవ్ 2023ని ప్రకటించిన ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో స్వదేశీయంగా అభివృద్ధి చెందిన ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ యొక్క డిజిటల్ బీ2బీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ అయిన ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్, తమ బీ2బీ సభ్యుల కోసం దీపావళి షాపోత్సవ్‌ను ఈ నెల 25 నుండి నవంబర్ 12 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. 'బోలో ఫైదే కి బోలి' అనే ట్యాగ్‌లైన్‌తో జరిగే ఈ వార్షిక విక్రయం మొత్తం 26 స్టోర్‌లలో అలాగే ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ యాప్‌లో అందుబాటులో ఉంటుంది. తమ ట్యాగ్‌లైన్‌కు అనుగుణంగా, దీపావళి షాపోత్సవ్ విభిన్న విభాగాలలో ఈ సీజన్‌లో అతిపెద్ద డీల్‌లను వేడుక చేసుకుంటుంది.

మన్నికతో ఒప్పో ఎ785జి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఒప్పో ఇండియా తన సరికొత్త ఎ79 5జిని విడుదల చేసింది. ప్రీమియం 5జి పరికరాన్ని కోరుకునే వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని దీన్ని తయారుచేయగా, సొగసైన డిజైన్, మృదువైన పనితీరు, మిశ్రమ వినియోగంలో ఒక రోజు పాటు ఉండే ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీ మధ్య సంపూర్ణ సమతుల్యతను కలిగి ఉంటుంది. పరికరం ధర రూ.19,999 కాగా, ఈ నెల 28 నుంచి ఒప్పో స్టోర్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఇతర రిటైల్ అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉంటుంది.

కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ చెస్ జట్ల ఎంపిక

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎం ఎస్ అర్ హై స్కూల్ లో శుక్రవారం అండర్ -14 చెస్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలో సుమారు 150 మంది బాల బాలిక లు పాల్గొన్నారు. ఎంపికలను రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.భాను మూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి కె. వి రాధా కృష్ణ, ఏ. పి.రాజు, ఎం.ఎస్.అర్.హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్యామల, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.లక్ష్మి, కె.మధు లు పాల్గొన్నారు. బాలుర జట్టుకు సి హెచ్ సాయి, పి.దర్శన్, ఎం.ఆదిత్య ,షేక్ అబ్దుల్ ఫాయాజ్, సరతక్ నాయర్ లు ఎంపికయ్యారు, బాలికల జట్టుకు వై.శరణ్య, నాగ సుభశ్రీ, నవ్య సాహితీ, హర్షిణీ ,ప్రవల్లిక లు ఎంపికయ్యారు .

స్కూల్ గేమ్స్ అండర్ -19 సైక్లింగ్, రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపిక

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జిఎఫ్‌ఐ) ఆదేశాల మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ - 19 బాలుర, బాలికల సైక్లింగ్, రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. సైక్లింగ్ సెలెక్షన్స్‌ను వికాస్ విద్యాసంస్థల వద్ద వికాస్ గ్రూపు ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీనివాస్ ప్రారంభించారు. వికాస్ కాలేజీ గేటు నుంచి ఇండ్లాస్ శాంతివన్ వరకు సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాల బాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. అండర్ -19 బాలుర, బాలికల జట్లు వచ్చే నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు బాపట్లలో జరగనున్న ఎస్‌జిఎఫ్‌ఐ అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొననుంది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇటీవల క్రీడలకు ఆదరణ విపరీతంగా పెరిగిందన్నారు. క్రీడలలో రాణించిన వారికి ఉన్నత విద్యా ప్రవేశాలతోపాటు ఉద్యోగవకాశాలు లభిస్తుండటంతో తల్లిదండ్రులు కూడా క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. దీనికితోడు జాతీయస్థాయిలో రాణించిన వారికి ప్రభుత్వం లక్షలాది రూపాయల నగదు ప్రోత్సాహాలను అందజేస్తుందని తెలిపారు. సైక్లింగ్ పోటీల నిర్వహణకు వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, వికాస్ గ్రూపు ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆఫీసర్లు శేఖర్ రెడ్డి ఫణి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె సుగుణరావు, అండర్ -19 సైక్లింగ్ ఎంపికల పరిశీలకురాలు శ్యామల, వ్యాయామ అధ్యాపకులు ఎంవి సత్యప్రసాద్, టి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీలకు విశేష స్పందన

ఎస్‌జిఎఫ్‌ఐ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల అండర్ -19 బాలుర, బాలికల విభాగాల రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపికలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు రెజ్లింగ్ సెలెక్షన్స్‌కు హాజరయ్యారు. ఈ ఎంపికలను నున్న జడ్పీ హైస్కూల్ ఆడిటోరియంలో అండర్ -19 విభాగం పరిశీలకురాలు శ్యామల ప్రారంభించారు. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా జట్లకు ఎంపిక చేశారు. వచ్చే నెల 11, 12, 13 తేదీలలో నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే అంతర్ జిల్లాల రెజ్లింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకులు ఎంవి సత్యప్రసాద్, టి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వృద్ధాశ్రమంలో అన్నదానం జరిగింది. మానవ సేవయే మాధవ సేవ ఆదర్శంగా తీసుకొని పనిచేస్తున్న డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటి ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన ఇంజనీరింగ్ కాలేజీ లెక్చరర్ బ్రహ్మ దేశం మాధవ్ తల్లి జ్ఞాపకార్థం వాంబే కాలనీలో ఉన్న మాతృ దేవోభవ వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదాన వితరణకు సహకరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కొండాయిగుంట రాము మాట్లాడుతూ సోషల్ సర్వీస్ సొసైటి ఆధ్వర్యంలో ఇప్పటి వరకు దాదాపు 120 అన్నదాన వితరణకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షుడు బ్రహ్మ దేశం వసంత కుమార్ మాట్లాడుతూ దేశ విదేశాల్లో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, దుబాయ్ లో వున్న స్నేహితులు అన్నదాన వితరణకు సహకరిస్తున్న అనిల్, భాను ప్రకాష్ తదితరులకు ధన్యవాదాలు తెలియచేసారు.

వైఎస్సార్ పురస్కారాలకు ఏర్పాట్లు : కలెక్టర్ డిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు నవంబర్ 1వ తేదిన రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న వైఎస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్(జీవిత సాఫల్య), వైయస్సార్ ఎచీవ్‌మెంట్(సాఫల్య) అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లతో విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులకు సూచించారు. వైయస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్, వైయస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం సందర్భంగా ఎ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఏర్పాట్లును శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 1వ తేది ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు అవార్డులను ప్రధానం చేయనుందన్నారు. ఈ ఏడాది ఏడు రంగాల్లో 27 మంది ప్రముఖులకు అవార్డులను ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. ప్రధానం చేయనున్న ఆయా అవార్డుల్లో 23 వైఎస్సార్ జీవిత సాఫల్య, 4 వైస్సార్ సాఫల్య అవార్డులు ఉన్నాయన్నారు. అవార్డ్ గ్రహీతలు లైజినింగ్ అధికారితో కలిసి కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారన్నారు. వారికి ఆహ్వానం పలికి వైఎస్ఆర్ సెల్ఫీ పాయింట్ వద్దకు తీసుకువెళ్లి సెల్ఫీ ఫోటో తీసిన అనంతరం వారికి కేటాయించిన ప్రత్యేక సీట్లలో కూర్చునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కొక్క అవార్డు గ్రహీతకు ఒక్కొక్క టెబుల్‌ను వరుస క్రమంలో కేటాయించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత విశేషాలతో కూడిన ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైయస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్, వైయస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డుల విశిష్టతను తెలుపుతూ ముద్రించిన బుక్‌లెట్‌లను ప్రతి ఒక్కరికి చేరేలా పంపిణీ చేయాలన్నారు. అవార్డుల ప్రధానం అనంతరం సీఎంతో అవార్డీలు గ్రూప్ ఫోటో తీసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సభా వేదికను, ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయాడ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, జేసీ డా.పీ.సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్ పాల్గొన్నారు.

రావి గెలుపునకు సైనికుడిలా పనిచేయాలి : దింట్యాల

విశాలాంధ్ర - గుడివాడ : రాష్ట్రంలో సైకో పాలన పోయి చంద్రన్న, రావిల గెలుపు కోసం ప్రతి టిడిపి కార్యకర్త సైనికుడిలాగ పనిచేయాలని టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రావి అదేశాల మేరకు గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరితో కలసి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు 9,10 క్లస్టర్‌లో బాబు షూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, బూత్ కన్వీనర్‌లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో రావి గెలపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. చంద్రబాబు నాయుడు మీద జరుగుతున్న అక్రమ కేసులు, భువనమ్మ ప్రారంభించిన నిజం గెలవాలి అనే కార్యక్రమం, లోకేష్ పున ప్రారంభించనున్న యువగళం కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, గుడివాడలో రావి వెంకటేశ్వరావును గెలిపించే విధంగా సమన్వయంగా ముందుకు వెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులతో భారీ పరిశ్రమలు

విశాలాంధ్ర- విజయవాడ ఎడ్యుకేషన్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులతో భారీ పరిశ్రమలు రాబోతున్నాయి అని, విశాఖ నగరానికి విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తనున్నాయని ఎస్ఆర్ఏఎం గ్రూప్ వైస్ చైర్మన్ డాక్టర్ కుమారన్ స్వామి అన్నారు. ఈ ఈ సందర్భంగా శుక్రవారం విజయవాడ నగరంలోని గేట్ వే హెూటల్ లో ఎస్ఆర్ఏఎం గ్రూప్, వేవ్స్ అబోర్డ్స్ 'సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు. యూకే దేశానికి చెందిన ఎస్ రామ్ గ్రూప్ మరియు విశాఖపట్నంకి చెందిన వెంచర్స్ వే అడాప్స్ భాగస్వామ్యంతో సుమారు 9146 కోట్ల రూపాయలతో బిజినెస్ పార్క్ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, ఇంటర్నేషనల్ స్కూల్ మరియు లగ్జరి కంఫర్ట్ రెసిడెన్షియల్ కమ్యూనిటీ వంటివి నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా సుమారు 8300 కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతున్నామని వేవ్స్ అబోర్డ్స్ మెనేజింగ్ డైరెక్టర్ మధుకర్ రెడ్డి తెలిపారని. ఎస్ఆర్ఏఎం గ్రూప్ వైస్ చైర్మన్ డాక్టర్ కుమారన్ స్వామి తెలియజేశారు

పబ్లిక్ ఇష్యూకు ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

విశాలాంధ్ర-విజయవాడ: ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (గతంలో కేకేఆర్ ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అని పిలిచేవారు) పబ్లిక్ ఇష్యూ కోసం అక్టోబర్ 11న ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసినట్లు ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ హెూల్ టైమ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భూపిందర్ సింగ్ తెలిపారు. ఒక్కొక్కటి రూ.వెయ్యి ముఖ విలువ కలిగిన లిస్టెడ్, రీడీమ్ చేయదగిన, కన్వర్టబుల్ కాని డిబెంచర్లు ఉన్నాయన్నారు. ఇష్యూ బుధవారం, అక్టోబర్ 25న తెరిచినట్లు చెప్పారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్‌కు అనుగుణంగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు లేదా ఫైనాన్స్ కమిటీ నిర్ణయించిన విధంగా ముందస్తుగా మూసివేయడం లేదా పొడిగింపు ఎంపికతో నవంబర్ 7 మంగళవారంతో ముగుస్తుందని తెలిపారు. రూ. 300 కోట్ల వరకు సురక్షిత ఎన్సీడీల కోసం ఈ ఇష్యూ అన్నారు.

ఆస్వాదించేందుకు వాకింగ్ కం సైక్లింగ్ ట్రాక్

నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : 125 అడుగుల బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం అందాలను ఆస్వాదించేందుకు బందర్ రోడ్ వైపు ఎంతో చక్కటి సైక్లింగ్ కం వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్థానిక పీడబ్యూడీ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం నిర్మాణ పనులను కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్పాత్ పనులు త్వరతిగతిన పూర్తిచేసి, అంబేద్కర్ విగ్రహ స్మృతి వనం చుట్టూ ట్రాక్‌పై సైకిలింగ్ చేసే విధంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని క్వాలిటి కంట్రోల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ డీసీపీ జుబిన్ శిరన్ రాయ్, ఈఈ ఏఎస్ఎన్.ప్రసాద్, క్వాలిటి కంట్రోల్ అధికారులు, కేపిసి ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

టీడీపీ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): టీడీపీ పథకాలు ప్రజల్లో తీసుకెళ్లాలని టీడీపీ నాయకులు నల్లపాటి రాము, ఎం.ఎస్ బేగ్ అన్నారు. శుక్రవారం విజయవాడ పంజా సెంటర్‌లోని హాజీయా ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబును ప్రజలకు దూరం చేయాలనే ఆలోచనతో జగన్మోహన్‌రెడ్డి అక్రమ కేసులు పెట్టించి అరెస్టు చేయించారన్నారు. టీడీపీ పథకాలు ప్రజలకు భవిష్యత్‌కు గ్యారంటీ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రజల్లో తీసుకెళ్లాలని, ప్రజలకు టీడీపీ మేనిఫెస్టో వివరించాలని కార్యకర్తలకు సూచించారు. జగన్మోహన్‌రెడ్డి సైకో పాలన, అక్రమలు, దౌర్జన్యలను వివరిస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలందరూ ప్రజల మధ్య ఉండాలన్నారు. అక్రమ అరెస్టు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ, సూపర్ సిక్స్ వంటి పథకాలు, భవిష్యత్ గ్యారంటీ, బాబు షురిటీ బాండును అందజేయాలని తెలియజేవారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి సారిపల్లి రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు సుకాసి కిరణ్, జిల్లా ఓటర్ వెరిఫికేషన్ ఇన్‌ఛార్జ్ కాజా, మహిళా అధ్యక్షులు సుకాసి సరిత, తెలుగు యువత అధ్యక్షులు రాళ్లపూడి మాధవ, బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి భాను ప్రకాష్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎర్ర రామారావు, ఐటీడీపీ పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షులు బెవర రవి కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షునిగా అంకమ్మరావు

విశాలాంధ్ర-ప్రత్తి పాడు : ఏఐటీయూసీ ప్రత్తిపాడు నియోజక వర్గ అధ్యక్షునిగా కుంచాల అంకమ్మ రావు, జాయింట్ సెక్రటరీగా నాగిరెడ్డి, ఆటో యూనియన్ కార్యదర్శిగా మేడా తాతారావు ఎన్నిక య్యారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 31న ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం జరుగుతుందని, కార్మికులందరూ ఆ రోజు జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమం తరావు మాట్లాడుతూ కార్మికులందరూ సంఘటితంగా ఉంటే హక్కులు సాధిం చుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎస్.అంజిబాబు, మండల కార్యదర్శి ఎం.అంకమ్మరావు, నియోజకవర్గ రిక్షా యూనియన్, పెయింటింగ్ వర్కర్స్, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

5జీ ల్యాబ్ స్థాపనకు విజ్ఞాన్స్ వర్సిటీ ఎంపిక

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీను భార త ప్రభుత్వంలోని డిపార్ట్‌మెం ట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ మినిస్ట్రీ విభాగం వారు నూతన ఆవిష్కరణలు, పరిశోధనలను మరింత విస్తృతం చేసేందుకు 5జీ ల్యాబ్ స్థాపనకు ఎంపిక చేసిందని భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న ఇండియన్ మొబైల్ కాంగ్రెస్-2023 గ్లోబల్ డిజిటల్ ఇన్నోవేషన్ కార్యక్ర మంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో పాటు దేశంలోని 100 యూనివర్సిటీల్లో 5జీ ల్యాబ్స్ స్థాపనకు కృషి చేస్తున్నట్లు ప్రకటించారని వెల్లడించారు. ఆన్‌లైన్ మోడ్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో వీక్షించారు. విజయ వాడలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ రూరల్ అండ్ టెక్నాలజీ డైరక్టర్ రామక్రిష్ణ మాజేటి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్లోబల్ డిజిటల్ గ్రామీణ ప్రాంతాలతో పాటు రిమోట్ ఏరియాలలో 5జీ టెక్నాలజీ వినియోగదారులను పెంచడంతో పాటు అకడమియా - ఇండస్ట్రీలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను మరింత అభివృద్ధి చేసి 6జీ టెక్నాలజీకై కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యమే మహా భాగ్యం లక్ష్యంగా: కత్తెర

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ఆరోగ్యమే మహా భాగ్యం లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహ న్‌రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారని తాడికొండ నియోజక వర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా అన్ని వర్గాల వారికి సమానంగా ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్న ఘనత జగనన్నదేనన్నారు. వైద్య శిబిరాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందుల కిట్లను పొందడం ప్రశంసనీయమని సీఎం సేవలను కొనియాడారు. టిడిపి హయాంలో చంద్రబాబు నాయుడు కోట్లాది రూపాయలు ప్రజల సొమ్మును మింగేసి నేడు జైల్లో ఊచలు లెక్క పెడుతున్నా డని గుర్తు చేశారు. అభివృద్ధి సంక్షేమంతో అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించేందకు ప్రజలు సిద్దంగా ఉండాలని సురేష్‌కుమార్ కోరారు. ఆరోగ్య పరంగా ఐసిడియస్ అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన వివిధ రకాల సౌష్టికాహార స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి, షేక్.షమెలా నర్గీస్, జడ్పిటిసి దాసరి కత్రేణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరామిరెడ్డి, అంజిరెడ్డి, బాపూజీరెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, బేతపూడి సొసైటీ చైర్మన్ షేక్. ఖాజావలి, సర్పంచ్ గంధూళి ఆదంబీ, గంధూళి మస్తాన్‌వలి, ఎంపిటిసి కాశీంషహీద్, షరీఫ్, చిన సుభానీ, వినుకొండ సుభానీ, నూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యంపై అధికారుల నిర్లక్ష్యం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మనిషి జీవన విధానానికి ప్రాణాం తకం కలిగిస్తున్న వాటిల్లో శబ్ద కాలుష్యం చాలా తీవ్రమైందని, ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని' అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరా మిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ తట్టుకోలేనంత శబ్ద ధ్వని మనిషికి, పక్షులకు, జంతువులకు ప్రాణాంతకమని అన్నారు. రోడ్డు మీద ప్రయాణించాలంటే వాహనాల సైలెన్సర్ల శబ్దం, పార్టీల మీటింగులు, పండుగల పందిళ్లు, ఊరేగింపులతో, ప్రార్థన సమావేశాల్లో డీజే స్పీకర్లు పెట్టి విపరీతమైన హోరు శబ్దాలతో ఇబ్బందులు పాలుచేస్తున్నారని దుయ్యబట్టారు. స్పోర్ట్స్ బైకుల పైన తమ ప్రాణాలను.. ఎదుటి వాళ్ళ ప్రాణాలను సైతం లెక్కచేయక సైలెన్సర్లు విప్పి మరీ రోడ్డు మీద విన్యాసాలు సృష్టిస్తున్నా అధికారులు చూస్తూ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సంగీత వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ళు ఇలా అన్ని రకాలుగా మనిషి శబ్దం కోరల్లో చిక్కిశల్యమై భరించలేని శబ్దాలతో చెవి వినికిడిని, కంటి చూపును కోల్పోతున్న వారు పెద్ద సంఖ్యలో ఉన్నారని పేర్కొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

భర్త మృతి... భార్యకు తీవ్రగాయాలు

విశాలాంధ్ర-మంగళగిరి : కాజ టోల్ ప్లాజా సమీ పంలో ఆగి ఉన్న లారీని ఓ ద్విచక్ర వాహనం ఢీ కొట్టిన ఘటనలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళగిరి రూరల్ ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల మేరకు విజయవాడ నగరంలోని రాణిగారి తోటకు చెందిన అంబటి ఆంజనేయులు(31) శిరీష దంపతులు కనిగిరిలోని బంధువుల వివాహానికి హాజరై శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై తిరిగి విజయవాడకు బయలుదేరారు. మార్గమధ్యలోని మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధి కాజ టోల్ ప్లాజా సమీపంలోకి వచ్చేసరికి అప్పటికే రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి ఉన్న విజయవాడ కార్పొరేషన్ చెత్త లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఆంజనేయులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా భార్య శిరీషకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఆంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన శిరీషను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు ఆంజనేయులు కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహిస్తుండగా భార్య శిరీష బ్యాంకు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తుందని, వీరికి ఇద్దరు ఆడపిల్లలు కలరని రూరల్ ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు.

కేఎల్‌యూలో ఆయుధాల ప్రదర్శన

విశాలాంధ్ర-తాడేపల్లి : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో బాగంగా శుక్రవారం మంగళగిరి 6వ బెటాలియన్‌కు చెందిన పోలీసు అధికారులు వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులకు ఆయుధాల గురించి అవగాహన కల్పించారు. పోలీసులు విధినిర్వహణలో శాంతిభద్రతల కోసం ఉపయోగించే ఆయుధాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి 6వ బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్ డీఎస్పీ పీవీ హనుమంతు మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సిబ్బంది చేపట్టే చర్యల గురించి వివరించారు. దాంతో పాటు విపత్తుల సమయంలో ప్రజలకు సేవలందించడానికి, ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడటానికి ఉపయోగించే వివిధ పరికరాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన శాంతిభద్రతలను కాపాడదానికి పోలీసులు ఉపయోగించే వివిధ ఆయుదాలు, రైఫిళ్లతో పాటు ఏకే47 వంటి అత్యాధునిక మెషిన్‌గన్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాదిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వలన సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు నిర్వర్తించే విధుల గురించి విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, మంగళగిరి 6వ బెటాలియన్ ఆర్ఐలు పి.చంద్రారావు, జి.సుభాష్ చంద్రబోస్, ఆర్ఎస్ఐ ఎం.లోకేష్, ఎఆర్ఎస్ఐలు పి.రఘుబాబు, ఎస్.మూర్తి, వైవీ సుబ్రమణ్యం, హెబీక్లబ్ ఇంచార్జి డాక్టర్ ఆర్.సుబాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాఫ్ ముసాయిదా జాబితాలు

విశాలాంధ్ర-తుళ్లూరు : ఈ నెల 26వ తేదీ నుంచి 29 వరకు ఖరీఫ్ 2023 ఈ-క్రాఫ్ ముసాయిదా జాబితాలను రైతులకు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీ రంజని చెప్పారు. శుక్రవారం మండలంలోని రాయపూడి, లింగాయపాలెం, పెదపరిమి, వడ్డమాను, హరిశంద్రపురం గ్రామాలలో సామాజిక తనిఖీ నిమిత్తం పంట నమోదు ముసాయిదా జాబితాలను రైతు భరోసా కేంద్రాలతో పాటు గ్రామ సచివాలయాలలో ఉంచామని చెప్పారు. జాబితాలలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రీవెన్స్‌లో నమోదు చేయించుకొని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల ద్వారా పరిష్కరించుకోవచ్చని రైతులకు ఏవో సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ, రెవెన్యూ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.